నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 31 జూలై 2024 | NALGONDA

రేపటి నుంచి 3వరకు డీఈఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

రామగిరి, జూలై 30 : డీఈఈ సెట్ - 2024లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలన ఆగస్టు 1న నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ కె.నర్సింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 1,253 మంది ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాకు ఎంపికైన విద్యార్థుల జాబితా డీఈఈ సెట్-2024లో అందుబాటులో ఉందని, దానిలో సీరియల్ నంబర్ ఆధారంగా ఆగస్టు 1న 1 నుంచి 400వరకు , ఆగస్టు 2న 401 నుంచి 800 వరకు, ఆగస్టు 3న 801 నుంచి 1,253 వరకు హాజరు కావాలని తెలిపారు. విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో (డీఈఈ సెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్‌సీసీ, ఇంటర్ మెమో, స్టడీ కండక్ట్స్, కులం, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు) ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆయా రోజుల్లో నల్లగొండలోని డైట్‌లో హాజరుకావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ పరిశీలన చేసుకున్న విద్యార్థులకు మాత్రమే కళాశాలల ఎంపికపై వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం లభిస్తుందని తెలిపారు.

రెండో విడుతలోనూ గల్లంతే..

రేషన్‌కార్డుతో లబ్ధిదారుల వడపోత

- కుటుంబమే ప్రామాణికం
- ఎంతమందికి రుణమున్నా రూ.1.50లక్షల వరకే మాఫీ
- భారీగా తగ్గిపోయిన లబ్ధిదారుల సంఖ్య
- రైతన్నల ఆశలపై రేవంత్ సర్కార్ నీళ్లు
- రెండో విడుతలో 82వేల మందికి రూ.947.43 కోట్ల మాఫీ

నల్లగొండ ప్రతినిధి, జూలై30(నమస్తే తెలంగాణ) : రుణమాఫీ అమలులో ఆర్థికంగా సాధ్యమైనంత వరకు భారం తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తన కుయుక్తులను కొనసాగిస్తున్నది తొలి విడుత మాదిరిగానే రెండో విడుతలోనూ రకరకాల కారణాలను చూపుతూ లబ్ధిదారుల సంఖ్యను అంతకంతకూ కుదించే ప్రయత్నాలు చేసినట్లు స్పష్టం అవుతుంది. లేదూ లేదంటూనే రేషన్‌కార్డు ప్రామాణికంగా కుటుంబాన్ని లెక్కిస్తూ ఒక్కో కుటుంబానికి గరిష్టంగా రెండు లక్షల రుణమాఫీ అమలయ్యేలా చర్యలు చేపట్టింది. దీంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గిపోతున్నది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో విడుతలోనూ సగానికి సగం రైతుల అడ్రస్సు గల్లంతైనట్లు తెలుస్తున్నది. మంగళవారం మధ్యాహ్నం రెండో విడుత రుణమాఫీలో రూ.లక్షన్నర వరకు అమలు చేస్తున్నట్లు ప్రకటించినా పూర్తి వివరాలు రైతుల వద్దకు చేరలేదు. సహకార సంఘాల లబ్ధిదారుల జాబితాలపై రాత్రి వరకు స్పష్టత రాకపోగా ఇతర బ్యాంకర్లు కూడా నేటి నుంచి దీనిపై దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం తరపున జాబితా వెల్లడైనా బ్యాంకుల వద్దకు వెళ్తేగానీ తెలువనున్నాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో విడుతలో మొత్తం 82,020 మంది రైతులకు గానూ రూ.947.43 కోట్ల రుణాలు మాఫీ అయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. తొలి దఫాలో రూ.లక్ష వరకు రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వం రెండో విడుతలో లక్షన్నర లోపు ఉన్న రైతులకు మాఫీ చేస్తున్నట్లు జాబితాలు వెల్లడించింది. దీంతో రెండు విడుతల్లో కలిపి కూడా ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,57,162 మంది రైతులకు గానూ రూ.1880.25 కోట్లు మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయి. వాస్తవంగా ప్రభుత్వం చెప్పిన విధంగా పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ అమలు చేస్తే ఐదు లక్షల మంది రైతుల వరకు లబ్ధిదారులుగా ఉంటారని రైతుసంఘాల నేతలు పేర్కొంటున్నారు. కానీ ప్రభుత్వం కొర్రీల మీద కొర్రీలు పెడుతూ రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబాన్ని లెక్కలోకి తీసుకోవడం వల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కనీసం రెండు లక్షల మంది రుణమాఫీకి దూరం అవుతున్నారని చెబుతున్నారు. ఇందుకు ఆధారంగా గతేడాది ఆగస్టులో కేసీఆర్ సర్కార్ చేసిన రుణమాఫీ లెక్కలను ముందుకు తెస్తున్నారు. అప్పట్లో కేసీఆర్ సర్కార్ పాసుపుస్తకం ఆధారంగా రుణమాఫీ చేయడం వల్ల పెద్ద ఎత్తున రైతులకు లబ్ధి జరిగిందన్నది వాస్తవం. ఎటువంటి షరతులు లేకుండా అమలు చేయడం వల్ల 99,999 రూపాయల వరకు రుణమాఫీ చేస్తేనే భారీ మొత్తంలో రైతులకు రుణాల నుంచి ఉపశమనం కలిగిందని అప్పటి లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కేసీఆర్ సర్కార్ చేసిన రుణమాఫీతో గతేడాది ఆగస్టులో ఉమ్మడి జిల్లాలో 4,00,518 మంది రైతులకు రుణమాఫీ వర్తించింది. మొత్తం రూ.2159.77 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. అంటే ఇది లక్షకు ఒక్క రూపాయి తక్కువ ఉన్న రుణాల వరకే కావడం విశేషం. కానీ ప్రస్తుతం లక్షన్నర వరకు రుణాలు మాఫీ చేసినా రెండు విడుతల్లో కలిపి 2.57లక్షల మంది రైతులకే మేలు జరుగుతుంది. అంటే భారీ ఎత్తున వడపోత చేస్తూ కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ వర్తించేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రేషన్‌కార్డులో ఎంత మంది ఉన్నా ఒక కుటుంబంలో గరిష్టంగా రెండు లక్షల రుణమాఫీ మించవద్దని ప్రభుత్వ ఆదేశాలుగా బ్యాంకర్లు, సహకార సంఘాల అధికారులు చెబుతున్నారు. ఇక రేషన్‌కార్డు లేని వాళ్లకు తొలి దఫాలోనే రుణమాఫీ వర్తించలేదు. రెండో దఫా సంగతి గురించి చెప్పేదే లేదన్నట్లుగా ఉంది. ఇలా వీలైనంత ఎక్కువమంది రైతులను తగ్గించడమే లక్ష్యంగా రుణమాఫీని అమలు చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది.

ఆత్మకూరు(ఎం) : గ్రామీణ వికాస్ బ్యాంకులో రుణమాఫీ గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న రైతులు

రెండో విడుత రుణమాఫీ వివరాలు

జిల్లా	రైతుల సంఖ్య	రూ.కోట్లలో..
నల్లగొండ	43,130	503.89
సూర్యాపేట	21,687	250.08
యాదాద్రి	17,203	193.46
మొత్తం	82,020	947.43

నేడు మరింత స్పష్టత

రెండో దఫా రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్యపై నేడు మరింత స్పష్టత రావచ్చిని తెలుస్తున్నది. మంగళవారం చాలా సొసైటీల్లో జాబితాలు రాత్రి వరకు వెల్లడికాలేదు. ఇక సోమవారం రాత్రి వరకు వ్యవసాయ అధికారులకు వచ్చిన లెక్కలకు... తీరా మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వం వెల్లడించిన లెక్కలకు పొంతన లేకుండా పోయింది. ఒక్క నల్లగొండ జిల్లానే పరిశీలిస్తే... వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం సోమవారం రాత్రి 83,649 మంది రైతులకు రెండో విడుతలో మాఫీ జరుగాల్సి ఉంది. వీరికి గానూ రూ.1014.68 కోట్ల రుణాలు మాఫీ కానున్నట్లు మీడియాకు వివరాలు పంపారు. తీరా మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వం నుంచి వచ్చిన లెక్కలు సగానికి సగం తగ్గిపోయాయి. ఒక్క రాత్రిలోనూ నల్లగొండ జిల్లాలో 43వేల మంది రైతులకు రూ.503.89 కోట్ల మేర మాత్రమే రుణమాఫీ వర్తించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంటే దాదాపు 40వేల మంది రైతులు తగ్గిపోయారు. దీనిపై వివరణ అడిగితే అధికారుల కూడా స్పష్టంగా ఏమీ చెప్పలేకపోతుండడం గమనార్హం. రైతుల వారీగా నేడు రేపు బ్యాంకులకు వెళ్తే వాస్తవ లబ్ధిదారుల సంఖ్యపై అంచనా రానుంది. దీంతోపాటు సహకార సంఘాల్లోనూ రైతుల సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉంది. దీని అనంతరమే రైతులు, రైతుసంఘాల నేతలు మరింత స్పష్టంగా స్పందించాలన్న యోచనతో ఉన్నారు.

మా ఇంట్లో ఇద్దరం రుణం తీసుకున్నామని మాఫీ చేయలేదు

తండ్రి కొడుకులం ఇద్దరం కలిసి రెండు పాసుబుక్కులు బ్యాంక్‌లో పెట్టి మూడు లక్షల రుణం తీసుకున్నాం. రుణమాఫీ వస్తుందని ఎంతో సంతోషం పడ్డాం. రెండు మాఫీ జాబితాల్లో పేర్లు రాకపోవడంతో నిరాశతో ఉన్నాం. బ్యాంకు, వ్యవసాయాధికారులను అడిగితే ఒకే కుటుంబంలో ఇద్దరు రుణం తీసుకోవడంతో మాఫీ కాలేదని చెప్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందేమో అధికారంలో రాగానే ఇంట్లో ఎంత మంది రుణం తీసుకున్నా మాఫీ చేస్తామని చెప్పారు. ఇప్పుడేమో రేషన్ కార్డును ప్రామాణికం తీసుకుంటున్నారు. లక్ష రూపాయలు కడితే తప్ప రుణమాఫీ కాదంటున్నారు. నిబంధనలు పెట్టి మాలాంటి రైతులకు రుణమాఫీ చేయకుండా అన్యాయం చేస్తున్నారు. కాంగ్రెసోళ్ల మాటలు విని మోసపోయాం.

– బొంగోని ఉప్పలయ్యగౌడ్, రైతు, నర్సాపురం, రాజాపేట మండలం

రేషన్ కార్డు లేక మాఫీ కాలేదు

నాకు ఈదులూరులో 4.32 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. నేను 2023 డిసెంబర్ లోపు ఈదులూరు గ్రామీణ వికాష్ బ్యాంకులో రూ.86 వేలు క్రాప్‌లోన్ తీసుకున్న. ఇప్పుడు అసలు, వడ్డీతో కలుపుకొని మొత్తం ఒక లక్షా రెండు వేల రూపాయలు అయ్యింది. కానీ లక్షన్నర లోపు రుణ మాఫీలో నా పేరు లేదు. అధికారులను సంప్రదిస్తే రేషన్ కార్డు లేకపోవడంతో ఇప్పుడు మాఫీ కాలేదని చెబుతున్నారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎలాంటి షరతులు తేకుండా మాఫీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులను అన్యాయం చేస్తున్నది. రేషన్ కార్డు ప్రామాణికం కాకుండా పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా రుణమాఫీ చేయాలి.

– గద్దపాటి సంగీత, ఈదులూరు, కట్టంగూర్ మండలం

నల్లగొండలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

మిషన్ పరివర్తన్‌తో గంజాయికి చెక్

- అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో గంజాయి టెస్టింగ్ కిట్లు
- డ్రంక్ అండ్ డ్రైవ్ మాదిరి గంజాయి సేవించిన వారి కోసం స్పెషల్ డ్రైవ్
- 50 మంది యువతకు కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసు యంత్రాంగం

నీలగిరి, జూలై 30 : యువకుల పాలిట శాపంగా మారుతున్న మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం అడుగులు ముందుకు వేసింది. మిషన్ పరివర్తన్ పేరుతో గంజాయి సేవిస్తున్న యువతను గుర్తించి వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించి మార్పు తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టింది. డ్రంక్ అండ్ డ్రైవ్ మాదిరిగా గంజాయి సేవించిన వారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన కిట్లను అన్ని పోలీస్ స్టేషన్‌లలో అందుబాటులో ఉంచింది. గంజాయితోపాటు ఇతర మాదక ద్రవ్యాలు సేవించిన వారిలో శరీరంలో ఆరు నెలలపాటు వాటి అవశేషాలు ఉంటాయి. ఇలా పోలీసులకు దొరికిన వారిని ఒకటి రెండు సార్లు పునర్వవస్థీకరణలో భాగంగా కౌన్సెలింగ్ ఇస్తారు. మూడోసారి కూడా దొరికితే వారిని ఆరు నెలలపాటు జైలు శిక్ష పడేలా పోలీసులు ప్రణాళిక రూపొందించారు. ఇక నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవించిన వారిని కూడా ప్రత్యేకంగా గుర్తించనున్నారు.

మాదక ద్రవ్యాలు సేవిస్తే ఆరు నెలల పాటు పాజిటివ్ రిపోర్టు

గంజాయితోపాటు మరే ఇతర మాదక ద్రవ్యాలు సేవించినా దాని ప్రభావం ఆరు నెలల పాటు శరీరంలో ఉంటాయని వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వచ్చిన ఫలితాల అధారంగా గంజాయి కిట్లను పోలీసులు ప్రవేశ పెట్టారు. దీని ద్వారా ఆరు నెలల్లో ఎప్పుడైనా వాటిని సేవిస్తే పాజిటివ్ రిపోర్టులు వస్తాయి. తెలిసి తెలియక మొదటి సారి సేవించిన వారిని పునర్వవస్థీకరణలో భాగంగా మార్పుకోసం మిషన్ పరివర్తన్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారు.

తొలిరోజు 50 మంది యువతకు కౌన్సెలింగ్

వారం రోజులుగా జిల్లాలో అర్ధరాత్రులు వీధుల్లో తిరుగుతున్న గంజాయి అలవాటు ఉన్న యువతను గుర్తించారు. మునుగోడు, మిర్యాలగూడ ప్రాంతాల్లో గంజాయి సేవించి పట్టుబడిన వారి తల్లిదండ్రుల సమక్షంలో మంగళవారం నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మానసిక వైద్య నిపుణులు శివరామకృష్ణ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల జరిగే నష్టాలు, వాటి దుష్పరిణామాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

15 నుంచి 30 సంవత్సరాలలోపు యువతపైనే ఎక్కువ ప్రభావం : కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 15 నుంచి 30 సంవత్సరాల లోపు యువతే గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. ఈ వయస్సు భవిష్యత్‌ను మలుచుకునేందుకు చాలా ముఖ్యమైన సమయం. దీనికి బానిస కావడం వల్ల జీవితం నాశనం అవుతుంది. దీన్ని అధిగమించి యుక్తవయసులో కుటుంబాలకు అండగా నిలువాలి. వీటిని సేవించడం వల్ల దాన్ని ప్రభావం మెదడుపై పడి మనిషి జంతువుగా మారిపోతాడు.

యుక్త వయస్సు చాలా కీలకం : ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ప్రతి ఒక్కరికీ యుక్త వయస్సు జీవితంలో చాలా ముఖ్యమైంది. ఈ ప్రాయంలోనే వారి భవిష్యత్‌కు పునాదులు పడతాయి. జీవితంలో బాల్యంలో లక్ష్యాలను ఎంచుకున్నప్పటికీ వాటిని సాకారం చేసుకునే సమయం ఇదే. ఈ సమయంలో వారు పెడదారిన పడితే భవిష్యత్ అంత అంధకారంగా మారడంతోపాటు సమాజంలో ప్రత్యేకంగా గెంటివేసేలా వారి జీవితాలు తయారవుతాయి.

నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద అలలతో కృష్ణమ్మ

సాగర్‌లో కృష్ణమ్మ జల సవ్వడులు

- శ్రీశైలంలో ఐదు క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- సాగర్‌కు 1,96,934 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నందికొండ, జూలై 30 : కృష్ణానది పరవళ్లు తొక్కుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో నాగార్జునసాగర్ రిజర్వాయర్ జల సవ్వడులతో తొణికిసలాడుతున్నది. శ్రీశైలం నుంచి సుమారు 85 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగార్జునసాగర్‌కు నీళ్లు వచ్చి చేరుతున్నాయని. శ్రీశైలం ప్రాజెక్ట్ గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకుగానూ ప్రస్తుతం 883.50 (207.41 టీఎంసీలు) అడుగులకు చేరుకోవడంతో వరద ఉధృతిని తగ్గించడానికి డ్యామ్ అధికారులు ఐదు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. క్రస్ట్ గేట్ల ద్వారా 1,35,935 క్యూసెక్కులు, జలవిద్యుత్ కేంద్రాల ద్వారా 60,999 క్యూసెక్కులు కలిపి 1,96,934 క్యూసెక్కులు నాగార్జున సాగర్ రిజర్వాయర్‌కు వస్తున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండడంతో నాగార్జునసాగర్‌వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతున్నది. త్వరలో సాగర్ జలాశయం నిండే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు గానూ ప్రస్తుతం 516.30 అడుగులు (142.61టీఎంసీలు) ఉన్నది. డ్యామ్ కుడి కాల్వ ద్వారా 6,877 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసి ద్వారా 800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. సాగర్‌కు వరద వచ్చి చేరుతుండడంతో ఆగస్టులో ఆయకట్టు సాగుకు నీటి విడుదల చేసే అవకాశం ఉన్నది. 2016లో సాగర్ నీటి మట్టం 514 అడుగుల వద్ద ఉన్నప్పుడు ఎడమ కాల్వకు ఆగస్టు 26న నీటి విడుదలను ప్రారంభించారు. ఇప్పుడు అంతకంటే ఎక్కువగానే నీటి నిల్వలు ఉండడంతో ఆయకట్టు రైతులు ఆశాజనకంగా ఉన్నారు.

డ్రైవర్ల అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

- ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాల్లో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

ప్రమాద రహిత డ్రైవర్లుగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

సూర్యాపేట అర్బన్, జూలై 30 : డ్రైవర్లు అప్రమత్తతతోనే ప్రమాదాలను అరికట్టవచ్చని, ఆర్టీసీ డ్రైవర్లు తాము చేస్తున్నది సమాజసేవగా భావించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల దేశ వ్యాప్తంగా సుమారు 1.60 లక్షల మంది మణించినట్లు గణాంకాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు లో ఎక్కువ మంది ప్రయాణిస్తారని, బస్సు ప్రమాదానికి గురైతే ప్రాణ నష్టం అధికంగా ఉం డే ప్రమాదం ఉందన్నారు. అందుకే డ్రైవర్లు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ప్రమాద రహిత డ్రైవర్లుగా ఎంపికైన 21 మందిని ఆయన ఘనంగా సన్మానించారు. జిల్లా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జయ ప్రకాశ్ రెడ్డి, రీజినల్ మేనేజర్ రాజశేఖర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మాధవి, శివశంకర్, సూర్యాపేట డిపో మేనేజర్ సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, కృష్ణయ్య, ఏకాంబర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రామన్నపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేటలోనే సబ్ కోర్టు ఏర్పాటు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

రామన్నపేట, జూలై 30 : పాత తాలుకా, పాత నియోజకవర్గ కేంద్రమైన రామన్నపేటకు మంజూరైన సబ్ కోర్టును వెంటనే ప్రారంభించి న్యాయ సేవలు అందించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సబ్‌కోర్టు నిర్మాణానికి ఐదెకరాల భూమిని సేకరించి అప్పగించడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రైతుల రుణమాఫీ చేయకుండా లక్ష, లక్షన్నర మాఫీ చేస్తున్నామని గోరంతను కొండంతగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా డబ్బులను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు వ్యవసాయ పనులను పక్కన పెట్టి బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ప్రశ్నిస్తే ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేస్తూ అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత మొదలైందన్నారు.

ఎక్కడికక్కడ అరెస్టులు

- చలో అసెంబ్లీ నేపథ్యంలో ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్మిక నాయకుల ముందస్తు అరెస్టులు

చిట్యాలలో అరెస్టయిన సీఐటీయూ నాయకులు, పంచాయతీ కార్మికులు

రామగిరి, జూలై 30 : తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా సంఘాల నాయకులతోపాటు కార్మికులను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముందస్తుగానే పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి ఇండ్లలో చొరబడి పోలీస్ స్టేషన్స్‌కు తీసుకెళ్లారు. అయినప్పటికీ కొంతమంది కార్మికులు ప్రత్యేక ప్రణాళికతో హైదరాబాద్‌కు వాహనాలు, బస్సుల్లో వెళ్లారు. నల్లగొండలో సీఐటీయూ నాయకులు దండెంపల్లి సత్తయ్యతోపాటు పలువురు కార్మికులను వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పలువురు జీపీ కార్మికులను రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఈ సందర్భంగా వారు ప్రభుత్వంపై మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకుండా ముందస్తు అరెస్టు చేయడం సరైంది కాదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్యలు ఒక ప్రకటనలో ఖండించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం ఆశ వర్కర్స్‌కు రూ.18వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కోమటిరెడ్డి అహంకారపూరిత వైఖరి నశించాలి

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు

దేవరకొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

దేవరకొండ రూరల్, జూలై 30 : అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా దేవరకొండలో బీఆర్ఎస్ శ్రేణులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేములరాజు మాట్లాడుతూ నల్లగొండ జిల్లాను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదన్నారు. జిల్లాను ఫ్లోరైడ్ రహితంగా మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, జగదీశ్‌రెడ్డిదని తెలిపారు. 60 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లాను ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నా యకులు బీఆర్ఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్నికల ముం దు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, బీఆర్ఎస్ శ్రేణులు మధు, ఖాధర్‌బాబా, సత్తార్, సత్యనారాయణ, చంద్రమౌళి, సైదులు పాల్గొన్నారు.

ఫలితాలను విడుదల చేస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఓఈ ఉపేందర్‌రెడ్డి, అధికారులు

ఎంజీయూ బీపీఈడీ, డీపీఈడీ ఫలితాలు విడుదల

రామగిరి, జూలై 30 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ బీపీఈడీ, డీపీఈడీ వివిధ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ ఫలితాలను ఇన్‌చార్జి వీసీ నవీన్‌మిట్టల్ ఆమోదంతో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి మంగళవారం ఎంజీయూలో విడుదల చేశారు. బీపీఈడీ నాలుగో సెమిస్టర్‌లో 247మందికి 206మంది.. మూడో సెమిస్టర్‌లో 54మందికి 37 మంది.. రెండో సెమిస్టర్‌లో 64మందికి ఇద్దరు ఉత్తీర్ణత సాధించారు. ఒకటో సెమిస్టర్‌లో 37 మందికి 21మంది పూర్తి సబ్జెక్టులు పూర్తి చేయగా ముగ్గురు ఉత్తీర్ణత సాధించారు. డీపీఈడీ నాలుగో సెమిస్టర్‌లో 95మందికి 59మంది.. మూడో సెమిస్టర్‌లో 22మందికి 13 మంది, రెండో సెమిస్టర్‌లో 16మందికి ఇద్దరు, ఒకటో సెమిస్టర్‌లో 11మందికి నలుగురు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల విడుదలలో పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, అస్టెంట్ కంట్రోలర్స్ లక్ష్మీప్రభ, సంధ్యారాణి పాల్గొన్నారు.